# పిపీలికం

- ఆకునూరి మురళీకృష్ణ

**"మొత్తం వీటికెంతైవుంటుందో ఊహించి చెప్పండి?" ఉదయానే పక్కింటావిడతో కలిసి వాకింగ్‌కని వెళ్ళి, అంత దూరం నడిచి వెళ్ళిన శ్రమ వృధాగా పోకూడదని వస్తూ వస్తూ రైతుబజార్ నుంచి మోసుకుని తీసుకువచ్చిన కూరలని వంటింట్లో నేలమీద పరిచి కూరలమ్మే దానిలా కూర్చున్న కాత్యాయిని అంది.**

తాగేసిన కాఫీ కప్పు సింకులో పడేద్దామని పొరపాట్న అటుగా వచ్చిన నేను 'తెలంగాణా' మీద వ్యాఖ్యానించి నాలుక్కరుచుకున్న అధికార పక్షం నాయకుడిలా ఇబ్బంది పడ్డాను. ఆరోజు దినపత్రిక ఇంకా నా చేతిలో వుంది. సగం చదివిన భారత ఉపఖండ విభజన గురించి కులదీప్ నయ్యర్ వ్యాసం నా మెదడులో తిరుగుతోంది. అలాంటి సమయంలో కాత్యాయిని ప్రశ్న నాకు విసుగు తెప్పించింది. అయినా 'బాధ్యత కలిగిన భర్త'ని కనుక ఆ విసుగుని పైకి కనిపించనీయకుండా నా నోటికొచ్చిన అంకె చెప్పాను. ఏదో ఒకటి చెప్పకపోతే ఆమె వదలదు.

నేను చెప్పిన అంకె విన్న ఆమె ముఖం ఏదో సాధించిన దానిలా ఆనందంతో వెలిగిపోయింది. "అందుకే మన సంసారం ఇలా వుంది. డబ్బు చెట్లకి కాస్తుందనుకుంటాం మనం. ఈ కూరలన్నిటికీ కలిపి యాభై రూపాయలే అయింది" అంది.

"అలాగా?" ఆశ్చర్యంగా అన్నట్టు చూస్తూ అక్కడినుంచి నిష్క్రమించబోయాను. మరోపక్క నన్ను కులదీప్ నయ్యర్ పిలుస్తున్నట్టనిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఆ సంభాషణనింక పొడిగించడం నాకిష్టం లేదు.

కాత్యాయిని నన్ను వదల్లేదు.

"అయినా ఆ రత్తమ్మకంత ఆశ పనికిరాదు" అంది.

భారత ఉపఖండ విభజనలోకి కొత్తగా ప్రవేశించిన ఈ రత్తమ్మ అన్న కేరెక్టరెవరో నాకు బొత్తిగా అర్థంకాలేదు.

"రత్తమ్మెవరూ?" అన్నాను. ఈసారి విసుగుని దాచుకోవడం నావల్ల కాలేదు.

"ఇంకెవరు? మన కాలనీలో కూరలకొట్టు ముసలమ్మ! మార్కెట్టు రేటుమీద కేజీకి మూడు రూపాయలు ఎక్కువేసుకుని అమ్ముతోందన్న సంగతి నాకివాళ గానీ అర్థంకాలేదు. పైగా ఆమె దగ్గర బేరమన్నదే వుండదు. మార్కెట్టు ఇక్కడికెంత దూరముందని? రెండు కిలోమీటర్లు. అంతే కదా? అరిచి గీపెట్టినా ఒక్కపైసా కూడా తగ్గించదు."

నాకు విషయం పూర్తిగా అర్థమైంది.

"రెండు కిలోమీటర్ల దూరంవున్న మార్కెట్‌కి వయసులో వున్న నీకే వెళ్ళడానికి బద్ధకం వేసి కాలనీలోని కొట్లో కూరలు కొనుక్కుందామనుకుంటున్నావే... మరి ఆ వయసులో ఆ ముసల్ది అక్కడినుంచి తెల్లవారుఝామున కూరలు తెచ్చి అమ్మడానికెంత కష్టపడాలి? ఆమె కష్టానికామాత్రం ప్రతిఫలం వుండద్దా? ఆమె కూడా బ్రతకాలి కదా?" అన్నాను.



నా వాదనకి కాత్యాయిని కన్విన్స్ కాదని నాకు తెలుసు. ఆమె ఒక అభిప్రాయానికి వచ్చిందంటే అంత తొందరగా దానిని మార్చుకోదు.

"బ్రతకడమా? బ్రతకడం కోసం కాదండీ ఆమె వ్యాపారం చేసేది. బ్రతకడానికామెకేం ఢోకాలేదు. మీకొక విషయం తెలుసా? కాలనీలో అందరూ చెప్పుకుంటూ వుంటారు. ఆమెకి బ్యాంకులో బోలెడన్ని డిపాజిట్లు వున్నాయంట. వాటిమీద వచ్చే వడ్డీతోనే ఆమె కాలిమీద కాలేసుకుని బ్రతికేయచ్చునట."

"ఆ డబ్బంతా పిల్లలకోసం కూడబెడుతోందేమో?" అన్నాను.

"నా ముఖం, ఆమెకి పిల్లాజెల్లా ఎవరూ లేరు. మొగుడు రెండేళ్ళ క్రితమే పోయాడు" తనకి తెలిసిన విషయాన్ని చెప్పింది.

"మరెందుకు ఈ వయసులో అంత కష్టపడి సంపాదిస్తోందంటావు?" అన్నాను.

"ఆశ... మమకారం... మనిషికి అన్ని మోహాలూ కాలక్రమంలో వయసుని బట్టి నశిస్తాయి కానీ, డబ్బుమీద మోహం మాత్రం చచ్చేదాకా తీరదు."

ఆ ముసలామెకలాంటి ఆశ వున్నదన్న విషయం ఎంతవరకూ నిజమో తెలియదు గానీ, ఆ ఆశ అన్ని రోజులూ మార్పులేకుండా సాగిపోతున్న అందమైన నా డైలీ రొటీన్ని ఘోరంగా దెబ్బతీస్తుందన్న విషయాన్ని మాత్రం నేనూహించలేదు.

ఉగాది పోటీలో ఎంపికైన కథ



మర్నాటినుంచీ నేను ఉదయాన్నే నిద్ర లేచి నాలుగు రోజులకొకసారి స్కూటర్ మీద రెండు కిలోమీటర్ల దూరం వున్న మార్కెట్టుకెళ్ళి కూరలు తీసుకురావాలని అల్టిమేటమ్ జారీచేసింది కాత్యాయిని.

ఉదయం లేచి ముఖం కడుక్కుని చిక్కని కాఫీ త్రాగుతూ ఆరోజు దినపత్రికనంతా కూలంకషంగా చదివేసి 'నిన్నటి'మీద ఒక అవగాహనకొచ్చేస్తే కానీ ఆ రోజులోకి అంత తొందరగా వెళ్ళాలనిపించదు నాకు. అలాంటిది నిద్ర లేవగానే సంచీ తీసుకుని కూరల మార్కెట్టుకెళ్ళడమంటే చాలా పెద్ద శిక్షే.

నాకంతటి శిక్షపడేలా చేసిన ఆ ముసలమ్మ మీద చాలా కోపం వచ్చింది. ఏదో ఒక రెండుమూడు రూపాయల తక్కువకి కూరలమ్మి ఈ ఆడవాళ్ళ మెప్పు పొందచ్చు కదా? అయినా కాత్యాయిని చెప్పినట్లు ముందూ వెనుకా ఎవరూ లేని ఆమె

సంపాదించి మాత్రం ఏం చేసుకుంటుంది?

ఆరోజు ఆఫీసుకెళ్ళేటప్పుడు దారిలో సందు చివరనున్న కూరలకొట్టు దగ్గరున్న ఆ ముసలమ్మని పరిశీలనగా చూసాను. కొట్టు దగ్గర బేరం ఏమీలేకపోయినా కూర్చోకుండా కూరల మీద చల్లటి నీళ్ళని చల్లుతూ, ఎండ తగలకుండా కూరగాయల గంపలని నీడలోకి జరుపుతోంది. ఆమె ఎంత శ్రద్ధగా ఆ పని చేస్తోందంటే చూస్తున్న ఒక్క నిమిషంలోనే పనిమీద ఆమెకున్న శ్రద్ధ చేస్తున్న పనిలో తెలిసిపోతోంది.

* * *

ఒకటి రెండుసార్లు ఆ ముసలామె నాకు మార్కెట్‌లో కనిపించింది. తెల్లవారుఝామునే మార్కెట్టుకి వస్తుంది. సరుకు రాగానే ఎంతో శ్రద్ధగా కూరగాయలు నాణ్యమైనవి, తాజావి ఏరి గీచి గీచి బేరమాడిమరీ కొంటుంది. ఆ కూరగాయల గంపలన్నింటినీ రిక్షాలోకి ఎక్కించుకుని కాలనీలో వున్న కొట్టుకు తీసుకువచ్చి కొట్టుముందు ఊడ్చి కళ్ళాపు జల్లి ఇంకా కాలనీలో జనాలంతా నిద్ర లేవకముందే కొట్టు తెరిచి కూర్చుంటుంది.

ఆ వయసులో కూడా అంత కష్టపడుతున్న ఆమెని చూస్తుంటే జాలి కలిగింది. కొంతమంది అంతే. ఎంత డబ్బున్నా సుఖపడే గీత వాళ్ళ నుదుటిమీద వుండదు. జీవితంలో చివరిదాకా ఏదో ఒకదానికి కష్టపడుతూనే వుంటారు. కానీ ఆమె తాపత్రయం దేనికోసమో నాకు అర్థంకాలేదు. బహుశా తను కూడబెడుతున్న డబ్బుమీద ఆశతోనైనా చివరి రోజుల్లో తననెవరైనా చూస్తారన్న ఆలోచనేమోననిపించింది. ఆ ఆలోచనతో ఆమెమీద జాలి కలిగింది.

ఆమె సైకాలజీ కొంచెం అర్థమైనట్లుగానే అనిపించినా, నేననుకున్న అభద్రతాభావమేదీ జాగ్రత్తగా గమనిస్తే ఆమె ముఖంలో ఎప్పుడూ కనిపించేది కాదు. దాని స్థానంలో ఏదో తెలియని ప్రశాంతత, ఈ రోజుల్లో మనుషుల ముఖాల్లో చాలా అరుదుగా కనిపించే సంతృప్తి కనిపించి నన్ను ఆశ్చర్యపరిచేవి. వాటినామెకి అందిస్తున్న అంతశ్శక్తేమిటో నాకు అంతుపట్టేది కాదు.

* * *

కాత్యాయినికి అనవసరమైన విషయాల్లో అవసరమైన దానికన్నా ఎక్కువే పరిజ్ఞానం వుందని నా బలమైన నమ్మకం. ఆరోగ్యానికి ఎప్పుడూ తాజా కూరగాయలే వాడాలన్నది ఆమె సిద్ధాంతం. కూరగాయల నాణ్యత విషయంలో ఆమెకి చాలా పరిజ్ఞానం వుంది. నేను యధాలాపంగా మార్కెట్టునుంచి తెచ్చిన కూరగాయల్లో చాలావరకూ ఆమె 'క్వాలిటీ టెస్టింగు'లో రిజెక్టయి వెలావెలా పోయేవి. ఫలితంగా నేను రెండు రోజులకొకసారి మార్కెట్టుకి వెళ్ళాల్సి వచ్చేది.

''ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఆ రత్తమ్మ కొట్లో కొంచెం రేటెక్కువైనా అన్నీ తాజా కూరగాయలు దొరికేవి. ఏరనివ్వదన్న మాటే కానీ ఇంటికొచ్చి చూసుకుంటే ఒక్క పుచ్చుకూడా కనిపించేది కాదు'' అంది కాత్యాయిని.

కాత్యాయిని రోజూ పీకే క్లాసులవల్ల నాకూ కూరగాయల నాణ్యత విషయంలో కొంత పరిజ్ఞానం అబ్బింది. ఆ పరిజ్ఞానంతో నేను తెలుసుకున్న విషయమేమిటంటే మార్కెట్లో దొరికే కూరగాయలకన్నా రత్తమ్మ కొట్టులో దొరికే కూరగాయలు తాజాగా వుంటాయి. అలా ఎలా సాధ్యపడుతోందో అర్థంకాలేదు. ఏదేమైనా కాత్యాయిని తీసుకున్న నిర్ణయం సరైనదికాదని నాకనిపించింది. మార్కెట్లో నేను తెచ్చే చచ్చు పుచ్చు కూరలకి, రోజూ మార్కెట్టుకి వెళ్ళి రావడానికయ్యే స్కూటర్ పెట్రోలు ఖర్చు ఇవన్నీ లెక్కేసుకుంటే చివరికి రత్తమ్మ దగ్గర కూరలు కొనడమే చవకని నాకనిపిస్తోంది.

కాత్యాయినికి కూడా క్రమంగా ఆ విషయం అర్థమై ఆమె తన నిర్ణయాన్ని మార్చుకునే రోజు దగ్గరపడుతున్న సమయంలో జరిగిందా సంఘటన.

ఆరోజు ఈవినింగ్ వాక్ చేస్తున్న నేనూ కాత్యాయినీ, మెయిన్‌రోడ్ వరకూ వచ్చాం. మెయిన్ రోడ్ మీదున్న మిషనరీ ఆర్ఫనేజ్ దగ్గర ఏదో మీటింగ్ అవుతోంది. కుతూహలంగా అటువైపు నడిచాం. అక్కడ వేదిక మీద కుర్చీలో కూర్చున్న వాళ్ళలో రత్తమ్మ కూడా వుంది!

మేము ఆశ్చర్యంగా మరింత ముందుకు వెళ్ళాం జనాలని తప్పించుకుని, ఆశ్రమానికి విరాళాలిచ్చిన దాతలకి ఆ వేదిక మీద సన్మానం జరుగుతోందన్న విషయం మాకు అర్థమై మరింత ఆశ్చర్యపోతూ చూసాం. వేదిక మీద ఎవరో వ్యక్తి ఆవేశంగా ఉపన్యాసం ఇస్తున్నాడు.

''సాటి మనిషికి సాయపడడానికి గొప్ప గొప్ప ధనవంతులే కానక్కర్లేదని, గొప్ప మనసుంటే చాలనీ కూరలకొట్టు రత్తమ్మ నిరూపిస్తున్నారు. కూరలమ్ముకుని జీవితం గడుపుకునే ఈమె మా ఆశ్రమానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళాన్నివ్వడం చాలా గొప్ప విషయం. ఈ రత్తమ్మ గురించి మీకందరికీ తెలియని విషయం ఇంకొకటి చెబుతాను. మా ఆశ్రమం గత నాలుగేళ్ళుగా ఎప్పుడూ కూరలు కొనలేదు. అందుకు కారణం ఈ రత్తమ్మే అని చెబితే ఎవరూ బహుశా నమ్మరేమో? కానీ అది నిజం. గత నాలుగేళ్ళుగా క్రమం తప్పకుండా ఆమె మా ఆశ్రమంలో పిల్లలకి అవసరమైన కూరగాయలు ఉచితంగా అందిస్తోంది... రోజూ సాయంత్రం కాలనీ వాళ్ళు కొనగా మిగిలిపోయిన కూరగాయలని రాత్రి కొట్టు మూసేసే ముందర తీసుకుని వచ్చి మా ఆశ్రమంలో ఇచ్చి వెళుతుందామె.



**మేము రోజూ మార్కెట్లో కొనే కూరలకన్నా రత్తమ్మ దుకాణంలో కూరలు ఏరోజుకారోజు తాజాగా ఎందుకుంటాయో అర్థమైంది నాకు. అంతేకాదు, ఆమె ముఖంలో రోజూ నాకు కనిపించే ప్రశాంతతని ఆమెకిచ్చే అంత శ్శక్తి ఏమిటో కూడా అర్థమౌతోంది.**

ఏరోజుకారోజు మిగిలిన కూరగాయల్ని మాకిచ్చేసి మర్నాడు మళ్ళీ మార్కెట్టునుంచి తాజా కూరగాయలని కొని తీసుకువచ్చి దుకాణం తెరుస్తుంది!!''

వింటున్న నేనూ, కాత్యాయినీ మా చెవుల్ని మేమే నమ్మలేకపోయాము.

''అన్నింటికన్నా గొప్ప విషయమేమిటంటే తను చేస్తున్న పనినామె పెద్ద గొప్ప విషయంగా పరిగణించకపోవడం. మిగిలిన కూరలనే కదా నేను ఇస్తున్నాను? అనేదామె. 'ఆ మిగిలిన వాటిని మర్నాడు అమ్మితే మరింత లాభం గడించవచ్చుకదా?'అని ఒకసారి నేను ప్రశ్నించినపుడు ఆమె జీవితంలో బాధాకరమైన విషయం ఏమిటంటే మనిషికున్న అన్ని మమకారాలూ కాలక్రమంలో వయసుతోపాటూ నశిస్తాయి. ఒక్క డబ్బు మీదున్న మమకారం తప్ప. మనం గ్రహించని విషయం ఏమిటంటే మనకున్న దాంట్లో కొంత ఇతరులతో పంచుకుంటే ఆ డబ్బుతో కొనలేని రెండు విలువైన ఆభరణాలు మన సొంతమౌతాయి. అవి 'మనసు నిండా సంతృప్తి, కంటినిండా నిద్ర' అని చెప్పిందామె. ఏమాత్రం చదువుకోని ఆమె చెప్పిన ఈ సత్యం మనందరం తెలుసుకో తగినది.''

ఆయనింకా ఏదో మాట్లాడుతుండగానే వింటున్న కాత్యాయిని ఆనందంగా చప్పట్లు కొట్టింది. ఆమెననుసరిస్తూ చాలామంది చప్పట్లు కొట్టారు. ఆశ్చర్యంనుంచి తేరుకున్న నేను కూడా చప్పట్లు కొట్టాను.

మేము రోజూ మార్కెట్లో కొనే కూరలకన్నా రత్తమ్మ దుకాణంలో కూరలు ఏరోజుకారోజు తాజాగా ఎందుకుంటాయో అర్థమైంది నాకు. అంతేకాదు, ఆమె ముఖంలో రోజూ నాకు కనిపించే ప్రశాంతతని ఆమెకిచ్చే అంతశ్శక్తి ఏమిటో కూడా అర్థమౌతోంది. మేము పిపీలికం అనుకున్న ఆమె ముసలామె 'బ్రహ్మాండం'లా కనిపించసాగింది. నిజమైన పిపీలికాలెవరో తెలుస్తోంది. ఆ కార్యక్రమం జరిగినంతసేపూ అక్కడే వుండి ఇంటికి వచ్చాం నేనూ కాత్యాయినీ.

* * *

మర్నాడు ఉదయం కూరల సంచీ తీసుకుని మార్కెట్టుకి బయలుదేరుతున్న నన్ను ఆపింది కాత్యాయిని. ''ఈరోజునుంచీ మీరు మార్కెట్టుకెళ్ళనవసరం లేదు. నేను రత్తమ్మ దగ్గరే కూరలు కొంటాను'' అంది.

ఆశ్చర్యాన్ని నటిస్తూ చూస్తున్న నాతో నవ్వుతూ ''మా లాభాల్లో ఒక శాతం మేము వికలాంగుల సంక్షేమానికి ఖర్చు చేస్తాం. మా ఉత్పత్తులు కొంటే మీరు కూడా ఆ పుణ్యకార్యంలో భాగం పంచుకున్నట్లే అని పెద్ద పెద్ద కంపెనీలు ప్రకటనలిస్తే వాళ్ళ ఉత్పత్తులని విరగబడి కొంటాం ఏదో గొప్ప పని చేస్తున్నట్లుగా ఫీలైపోతూ. అలాంటి ప్రకటనల్లో నిజమెంత వుంటుందో తెలియదు కానీ, ఈ రత్తమ్మ దగ్గర కూరలు కొనడం మాత్రం నిజంగా పుణ్యకార్యమే'' అంది.

మర్నాటి నుంచీ నేను నాకిష్టమైన మార్నింగ్ కాఫీనీ, న్యూస్ పేపర్నీ ఎటువంటి ఆటంకం లేకుండా హాయిగా ఎంజాయ్ చేయగలుగుతున్నాను. వాటినే కాదు, ఇంకా చాలా విషయాలని 'ఎంజాయ్' చేయడం నేర్చుకున్నాను!

★